## క్లుప్తంగా

### నియామకం



హన్మకొండ: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ – గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్ యువత హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా చెలిమల్ల సాగర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కళాసాని సంజయ్‌రెడ్డి తెలిపారు. హనుమకొండకు చెందిన చెలిమల్ల సాగర్ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి ఆయనను ఈ పదవిలో నియమించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, గాంధీ మార్గంలో యువత నడవడానికి కృషి చేస్తానని తెలిపారు.

### మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేందర్



వరంగల్ లీగల్: తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమకొండ జిల్లాకు చెందిన న్యాయవాది నల్లెల సురేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు మున్నూరు కాపు సంఘం నాయకులు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పుట్టం పురుషోత్తం, పెద్ది పెంటయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### తల్లికి బిడ్డ అప్పగింత




ఖిలా వరంగల్: మతిస్థిమితం కోల్పోయిన రుక్మిణి అనే మహిళ.. వర్ధన్నపేట మండలం దివిటిపల్లి గ్రామంలో ఒంటరిగా, అనుమానాస్పదంగా తిరుగుతుండగా గ్రామస్తుల సమాచారం మేరకు వరంగల్ సఖి కేంద్రం నిర్వాహకురాలు వల్లె శ్రీలతకు పోలీసులు ఇటీవల అప్పగించారు. ఆమె వివరాలు తెలుసుకొని బీహార్ రాష్ట్రంలోని ఆమె తల్లికి సమాచారం అందించి సఖి కేంద్రానికి రప్పించి గురువారం అప్పగించారు.

### ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ న్యూశాయంపేటలోని శ్రీరాజరాజేశ్వరి ఆటో యూనియన్ ఆటో డ్రైవర్లకు బజాజ్ ఆటో షోరూం ఆధ్వర్యంలో యూనిఫాంలను గురువారం పంపిణీ చేశారు. యూనిఫాం ధరించి ఆటో నడపాలనే ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు బజాజ్ ఆటో షోరూం నిర్వాహకులకు కార్పొరేటర్ మామిండ్ల రాజు విజ్ఞప్తి మేరకు వంద మంది డ్రైవర్లకు యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వేల్పుల సాంబమూర్తి, రాసమల్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు పట్టాలిప్పిస్తా..



న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని పలివేల్పుల భగత్‌సింగ్‌నగర్ వాసులకు పట్టాలు ఇప్పిస్తానని కాలనీవాసులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు భరోసా ఇచ్చారు. హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో గురువారం బసచేసిన ఆయనను హనుమకొండ జిల్లా కార్యదర్శి కే.భిక్షపతి, కార్యవర్గ సభ్యుడు ఏ.వెంకట్రాజం నేతృత్వంలో కాలనీవాసులు కలిసి తమ సమస్యను వివరించారు. కార్యక్రమంలో టి.శ్రీనివాస్‌రావు, టి.భిక్షపతి, స్టాలిన్, రవి, రాజు, పద్మ, వీరలక్ష్మి, కుమార్, మొగిలి, ప్రవర్ధన్, రమాదేవి, కిషన్, శ్రవణ్‌కుమార్, నందిని, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

### పేద విద్యార్థులకు చేయూత



విద్యారణ్యపురి: హనుమకొండలోని పెద్దమ్మగడ్డలోని పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని నిరుపేద విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్టు ఆధ్వర్యంలో 2025వ సంవత్సరానికి టచ్ ది సాయిల్, స్కాలర్‌షిప్‌లను గురువారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోఆర్డినేటర్ నరేందర్, మాజీ కార్పొరేటర్ బోడ అనయ్, హైస్కూల్ హెచ్‌ఎం రాంజీ, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం వేదాంత్‌చారి, ఉపాధ్యాయులు హరీష్, అశోక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### తల్లిపాల వారోత్సవాలు

ఖిలా వరంగల్: తూర్పు కోటలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ సువర్ణ హాజరై తల్లిపాల ప్రాముఖ్యతను బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వహీద, స్వర్ణలత, రాజమణి, శోభ, రమాదేవి, ఆశ వర్కర్లు కవిత, రజిత, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కొండెక్కిన కొబ్బరికాయ ధరలు

- శ్రావణమాసం కావడంతో ధర రెట్టింపు
- హోల్‌సేల్‌లోనే ఒకటి రూ.40 చొప్పున విక్రయం



బీటుబజార్‌లో ఓ షాపు ఎదుట కొబ్బరికాయలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఓల్డ్ బీట్ బజార్‌లోని కొబ్బరికాయల హోల్‌సేల్ దుకాణాల్లో కొబ్బరికాయల ధరలు కొండెక్కాయి. గతేడాది శ్రావణంతో పోల్చుకుంటే ఈసారి ధరలు రెట్టింపయ్యాయి. భగవంతుడికి భక్తితో సమర్పించాల్సిన కొబ్బరికాయ పేరు వినగానే దేవుడా.. ఇవేం రేట్లు అంటూ కొనుగోలుదారులు వాపోతున్నారు. మార్కెట్‌లో రెండు వారాల క్రితం వరకు రూ.25లు ఉండగా.. శ్రావణమాసం కావడంతోకా ధర రెట్టింపయింది. బుధవారం అతిచిన్న సైజు కాయ రూ.30లు ఉండగా, మోస్తరు సైజు రూ.40లు విక్రయిస్తుండగా, ఆలయాల ప్రాంగణంలో మరో రూ.10 పెంచి అమ్ముతున్నారు. శ్రావణంలో ప్రతి ఇంట్లో, దేవాలయాల్లో నిత్య పూజలు ఉంటాయి. వరలక్ష్మి, మంగళగౌరి వ్రతాలు చేసేవారు టెంకాయ కొట్టి దైవారాధన చేస్తారు. పండుగల మాసం కావడంతో ఆలయాల్లో రద్దీ ఎక్కువైంది. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు రేట్లు పెంచి విక్రయిస్తున్నారు.

**ఆలయాల వద్ద అధిక ధరలకు..**

భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయం, నాగమయ్య గుడి, దుర్గేశ్వరస్వామి దేవాలయం, బాలా వేంకటేశ్వరస్వామి, సంతోషిమాత దేవాలయం, మెట్టుగుట్ట, గీతామందిరం తదితర ఆలయ పరిధిలోని కొబ్బరికాయల విక్రయాల షాపుల్లో, కిరాణం షాపుల్లో చిన్న పరిమాణం ఉన్నవే రూ.50కు ఒక్కటి చొప్పున విక్రయిస్తున్నారు. కాయ పెద్దగా ఉంటే రూ.60 నుంచి రూ.70 వరకు ధరలు చెబుతుండడంతో వినియోగదారులు ఖంగుతింటున్నారు. పక్క రాష్ట్రాల్లో వర్షాలు, తెగుళ్లతో తోటలు దెబ్బతిని కాయలు దొరకడం లేదని, అందుకే ధరలు పెరిగినట్లు కొందరు వ్యాపారులు చెబుతున్నారు.

## వంట కార్మికులను ఆదుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి




ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

హన్మకొండ అర్బన్: వెట్టి చాకిరీకి గురవుతున్న వంట కార్మికులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆరోపించారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లో పౌష్టికాహారం అందించాలని నిర్ణయించిదని, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధుల కేటాయింపుతో మధ్యాహ్న భోజనం పథకం కొనసాగుతోందని అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కార్మికులకు రూ.10 వేల గౌరవ వేతనం అందిస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయలేదని వాపోయారు. అనంతరం కార్మికులతో కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలోని అధికారులకు అందజేశారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్, గడ్డం లలిత, ధర్మల రామ్మూర్తి, ఇందిర, రమాదేవి, ఒల్లాల లక్ష్మి, మునిగాల భిక్షపతి, రాజేశ్వరి, విజయ, జనగామ లక్ష్మి, కమల, అమృత, వనమాల, జక్కుల కుమారస్వామి పాల్గొన్నారు.

## కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి




నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రమేష్

ఎంజీఎం: ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గత 12 నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ క్రమంలో పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు లేబర్ కాలనీ ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట కార్మికులతో కలిసి గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తున్న స్వీపర్లు, సెక్యూరిటీ కార్మికులకు 12 నెలలుగా జీతాలు రాక కుటుంబపోషణ భారంగా మారిందని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల జీతాల విషయమై గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగా, 2 నెలల జీతాలు మాత్రమే కాంట్రాక్టర్ చెల్లించాడని, ఇంకా 12నెలల జీతం పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గుండె బద్రి, ఎండీ.యాకూబ్, జిల్లా నాయకులు నర్సింగం, ఈఎస్ఐ ఆస్పత్రి కార్మికులు మణిప్రసాద్, ప్రవీణ్, రజిత, రేణుక, కవిత, సుమలత, విజయ, జోష్ణ, రజిత, శ్యామల, ప్రేమ్‌సాగర్, ఆనంద్, పుష్పలీల, శోభ, సతీష్, సుకన్య, మహేష్, మధుసూదనాచారి, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే



వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ: గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం తప్పదని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య యాదవ్ హెచ్చరించారు. గొర్రెలు, మేకలకు వస్తున్న వివిధ రోగాలకు ఉచితంగా మందులు ఇవ్వాలని, వాటి మేత కోసం ప్రభుత్వ భూములు కేటాయించాలని, గొర్రెల పంపిణీలో రూ.2 లక్షలు నగదు బదిలీ చేయాలని కోరుతూ హనుమకొండ జిల్లా పశు సంవర్థక, పశు వైద్యశాఖ జిల్లా అధికారి రాధాకిషన్‌కు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లింగయ్య యాదవ్ మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు ఏడాదికి మూడుసార్లు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తామని చెప్పి 20 నెలలవుతున్నా నేటికి పంపిణీ చేయలేదని విమర్శించారు. చెరువు శిఖం తుమ్మ చెట్లు గొర్రెల కాపరుల సొసైటీలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల రమేష్, సభ్యులు గండ్రకోటి కుమార్, పిడుగు రాజేందర్ పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### రేపు కేయూలో ఆదివాసీ దినోత్సవం

కేయూ క్యాంపస్: ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆదివాసీ విద్యార్థి సంఘం కేయూ అధ్యక్షుడు బంబారు రాహుల్ తెలిపారు. ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని ఆదివాసీల తెగలు ప్రత్యేక సంస్కృతీ సంప్రదాయాలు కలిగి ఉన్నాయని గుర్తుచేశారు. అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ అందడం లేదని తెలిపారు.

### రైలు కింద పడి గుమస్తా ఆత్మహత్య

ఖిలా వరంగల్: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు కథనం ప్రకారం..వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన మూలక కోటేశ్వర్ (40) ఓ బట్టల షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది గురువారం తెల్లవారుజామున వరంగల్ హంటర్ రోడ్డు సమీపాన రైల్వే ట్రాక్‌పై గోదావరి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఎంజీఎం పోస్టుమార్టానికి తరలించారు. శవ పరీక్ష అనంతరం మృతుడి భార్య భవానికి మృతదేహాన్ని అప్పగించినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపారు

### రైల్వే కార్మికుడి ఇంట్లో చోరీ

కాజీపేట: కాజీపేట ఈఎల్ఎస్ రైల్వే క్వార్టర్స్‌లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉండే కార్మికుడు రామగిరి భిక్షపతి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి దొంగతనం చేశారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు నగలు, రూ.5వేల నగదు అపహరించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

రైల్వే జంక్షన్‌కు సమీపంలో ఉన్న రైల్వే క్వార్టర్స్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సుధాకర్ రెడ్డి కార్మికులను కోరారు. గురువారం రైల్వే కార్మికులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశ ఉన్న నేపథ్యంలో ఎవరు ఎటువంటి వారో అర్థం చేసుకోవడం కష్టమవుతుందన్నారు. క్వార్టర్స్ రోడ్డుతోపాటు ఇళ్ల ముందు కెమెరాలు ఉంటే నేరాలు తగ్గే అవకాశం ఉంటుందని గుర్తించాలని కోరారు.

### బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఖిలా వరంగల్: భూమిని ప్లాట్లుగా చేసి విక్రయించిన వ్యక్తులు వాటా ఇవ్వాలని, లేకుంటే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం హనుమకొండ విద్యారణ్యపురికి చెందిన సంగు గోవర్ధన్‌రెడ్డి, అతని అనుచరులు కలిసి ఖిలా వరంగల్ శివారులో భూమిని కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించారు. అందులో తనకు పావు వాటా ఇవ్వాలని, ఇవ్వకపోతే చంపేస్తానని వారిని కాశికుంట ఉర్సు కరీమాబాద్‌కు చెందిన బండి సుభాష్ బెదిరించాడు. దాంతో బాధితుల ఫిర్యాదు మేరకు సుభాష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ వివరించారు.

### సినారె పురస్కార గ్రహీతకు అభినందన

కేయూ క్యాంపస్: డాక్టర్ సి.నారాయణరెడ్డి పురస్కారం గ్రహీత, కేయూ తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంథిని శంకర్‌ను కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, తదితరులు గురువారం అభినందించారు.

### సదానందానికి..

వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో సకలకళ సంబరాల జాతరలో పాల్గొని బుర్రకథ కళలో ప్రతిభ చాటిన, కాకతీయ యూనివర్సిటీలో వీసీ పేషీలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న మోతె సదానందం వీసీ ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

## సీఎన్‌జీ గ్యాస్ స్టేషన్లు పెంచాలి

న్యూశాయంపేట: గ్రేటర్‌లో సీఎన్‌జీ గ్యాస్ దొరకడం లేదని, ఈ మేరకు సీఎన్‌జీ గ్యాస్ స్టేషన్ల సంఖ్య పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ బషీర్ డిమాండ్ చేశారు. సెంట్రల్ జైల్ ఆవరణలో గురువారం ఆందోళన చేశారు.

## జూడోలో రాణించిన గురుకుల విద్యార్థులు



మడికొండ: జూడో పోటీల్లో మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల విద్యార్థినులు పాల్గొని ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ఈ నెల 5నుంచి 7వ తేదీ వరకు వరంగల్‌లోని కెమిస్ట్ భవనంలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో పోటీల్లో విద్యార్థినులు కే.దీపిక, ఎస్.నిరీక్షణ, కే.రేవతి, కే.కృప పాల్గొని బంగారు పథకాలు, మరో ఐదుగురు విద్యార్థులు టి.అశ్రిత, సహస్ర, తహ నియత్, విద్య, కే.కావ్య పాల్గొని ప్రతిభ కనబరిచి వెండి పథకాలు, ఇంకో నలుగురు విద్యార్థులు మధుప్రియ, టి.వైష్ణవి, కే.సహజ, రహీల కాంస్య పథకాలు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులతో పాటు జూడో కోచ్ నాగరాజు, పీడీ పద్మ, పీఈటీ సరితను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు గురువారం అభినందించారు.

## నిండైన భారతీయతకు చేనేత వస్త్రాలు



రామన్నపేట: నిండైన భారతీయతకు నిజమైన అందానిచ్చేవి చేనేత వస్త్రాలేనని, చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలకు ప్రోత్సాహించాలని అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ సూచించారు. అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా కొత్తవాడ సెంటర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 20 మంది చేనేత కార్మికులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, గౌరవ అధ్యక్షుడు కుసుమ సతీష్, సెక్రటరీ గోరంట్ల రాజు, రాష్ట్ర నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, బేతి అశోక్, బాసాని శ్రీనివాస్, కూరపాటి సంపత్, మాసబత్తుల కుమార్, వలస సుధాకర్, కుచన రమేష్, తుమ్మ రమేష్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

న్యూశాయంపేట: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టి.వెంకట్రాములు కోరారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ కొత్తవాడలో చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తమ దేశ చేనేతను బ్రిటిష్ పాలకులు విధ్వంసం చేస్తే, నేటి స్వదేశీ పాలకులు.. కార్పొరేట్ మిల్లుల యజమానులకు తొత్తులుగా మారి చేనేతను నిర్లక్ష్యం చేస్తూ కోట్లాది కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. నేత కార్మికులకు ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్, సారంగపాణి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రామన్నపేట: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత సూచించారు. కాశిబుగ్గలోని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుజాత మాట్లాడుతూ భావితరానికి పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించాలన్నారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, కోఆర్డినేటర్ తిరుమలరెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణ, డీన్ వెంకటేష్, ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 'సఖి' సేవలపై మహిళలకు అవగాహన



కాజీపేట: మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ సంస్థ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా చట్టాలు, సఖి సేవలపై మహిళలకు కాజీపేట మండలం సోమిడి అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సఖి సెంటర్ ఏర్పాటు ఉద్దేశాలు, అందిస్తున్న సేవలను లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి వివరించారు. గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి వేధింపుల బాధితులకు సఖి సెంటర్ అండగా ఉంటుందని చెప్పారు. బాధిత మహిళలు, బాలికలు హెల్ప్ లైన్ నంబర్లు 181, 1098, 0870 – 2452112, 73829 83088లలో సంప్రదించాలని సూచించారు. అనంతరం సఖి సేవల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సదస్సులో సఖి కేస్ వర్కర్ భారతి, డాక్టర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు అభినందనీయం

హన్మకొండ అర్బన్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని హనుమకొండ ఏసీపీ నరసింహారావు కొనియాడారు. నగరంలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా మందిరంలో బాబాను గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అవరణలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు నిర్వహిస్తున్న మొబైల్ వైద్య సేవలను పరిశీలించి డాక్టర్ సిద్ధార్థ, సిబ్బందిని అభినందించారు. ఏసీపీ నరసింహారావుకు ఆలయ చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, పూజారులు మణిశర్మ, చందు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్, మందిర సిబ్బంది సాయికృష్ణ, రాజు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాలి

- ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్



మొక్క నాటి నీళ్లు పోస్తున్న అంకిత్‌కుమార్

మామునూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ పిలుపునిచ్చారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మామునూరు పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టిక, వివిధ రికార్డులు, కేసుల ఫైళ్లను పరిశీలించారు. కేసుల వివరాలను ఇన్‌స్పెక్టర్ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మామునూరు పోలీస్‌స్టేషన్, ఏసీపీ కార్యాలయ ప్రాంగణంలో ఏసీపీ వెంకటేష్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీసీపీ అంకిత్‌కుమార్ హాజరు కాగా, ఏసీపీ వెంకటేష్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్, ఐనవోలు శ్రీనివాస్, సంగెం నరేష్, పర్వతగిరి ప్రవీణ్, ఏనుమాముల రాజు, కర్నె రవీందర్ పాల్గొన్నారు.

## భాషా నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు

న్యూశాయంపేట: భావ వ్యక్తీకరణ, భాషా నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయని కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడు, నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అన్నారు. వరంగల్ నగరంలో దేశాయిపేట సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గ్రంథపాలకుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమర్థవంతమైన సంప్రదింపు అనే అంశంపై ఒకరోజు సెమినార్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ధర్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్లం నవీన్ పాల్గొని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాటలు, భావాలు, సమాచారం, ఆలోచనలను స్పష్టంగా, సరైన రీతిలో ఇతరులకు అర్థమయ్యేలా చెప్పడం ఎలా అనేది అంశంపై వివరించారు. కన్వీనర్ అనిల్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎల్.వరప్రసాదరావు, కెప్టెన్ డాక్టర్ పుజారి సతీష్, కుమార్ పాల్గొన్నారు.



వెలాసిటీ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. - నయీంనగర్

## ముందస్తు 'రాఖీ'



నగర వ్యాప్తంగా ముందస్తు రాఖీ వేడుకలను పలు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు.

- సాక్షి నెట్‌వర్క్

పైడిపల్లిలో రాఖీలు కడుతున్న చిన్నారులు




















సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
బి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)